**సాధారణంగా అందంమీద అంచనా అభిమానంతో కూడుకున్నదిగానే వుంటుంది, ఒక్కోసారి ఆ అంచనా వంచన చేస్తుందేమో!**

చుట్టూ పంట చేలు చల్లని గాలి అక్టోబరు మొదటివారం. నాట్లయిపోయి పొలాలన్నీ లేతపచ్చదనంతో విరగబడి పోతున్నాయి.

గుంటూరునించి పొన్నూరు వెళ్తున్నాము. మధ్య చిన్న చిన్న వూళ్ళు. చుట్టూ పంట కాలువలు. అంతా పచ్చదనమే. అయినా, అక్కడక్కడ మచ్చల్లాగా....

# అంచనా (కథ)

## శ్రీమతి వాణీరంగారావు



ఏ గ్రామంలో చూసినా ఒకటో అరో పెంకుటిళ్ళు ఇంచు మించు అన్నీ తాటాకు పాకలే. ఫెళ్ళున ఒక్క గాలి వీస్తే ఎగిరి పోయేట్లు.

ప్రకృతి తానెంత పచ్చగా వున్నా మనిషిని మాత్రం సుఖపడనివ్వదేమో! నాట్లు నిరాటంకంగా జరిగి పంట పాలుపోసుకుని తీరా కోసుకుని చేతి కొచ్చేదాకా లేదు గదా! మూడేళ్ళ నించీ ఇదే తంతు. మరి, పాకలు గాక మేడలు ఎలా వుంటాయి?

మేడలు లేవు సరికదా! గోచీలు పెట్టుకున్న పసిపిల్లలు. కొందరికి అవికూడా లేవు దున్నల మీదా, గేదెల మీదా కూర్చుని వూరేగుతున్నారు.

నా పదేళ్ళ కూతురు శిరీష అడుగుతోంది.

"అమ్మా! మరి మాగజైన్స్‌లో అదర్ కంట్రీస్ పీపుల్ వ్యవసాయం చేసినా నీట్‌గా వుంటారు గదమ్మా! వీళ్ళిలా వున్నారేం?" అని. ఏం చెప్పను? పేపరులో నిన్న చదివిన వయోజన విద్య గురించి మొన్న చదివిన కంపల్సరీ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ గురించీ ఓ లెక్చెర్ ఇద్దామనుకున్నాను. కానీ, అది అడిగిన ప్రశ్నకి జవాబు ఇదికాదుగదా అని ఊరుకున్నాను. సిగ్గేసి నా తలకాయని చేతిలో వున్న పత్రికలో దూర్చేశాను.

# మల్లెపందిరి

## నా అశక్తత నాకుం తెలుసు కనక-

ఫస్టు మార్కు రాదు. టిక్కెట్టు కొనడానికి డబ్బులు లేవు. అయినా మొరపెట్టు కుంటున్నాను-ఏమిస్తావో అదే ఇయ్య.

అజ్ఞస్త్వావదహం న మందధిషణః కర్తుం మనోహారిణీః
చాటూక్తీః ప్రభవామి, యామి భవతో యాభిః కృపాపాత్రతాం ।
ఆర్తేనా శరణేన కిం తు కృపణే నాక్రందితం కర్ణయోః
కృత్వా సత్వరమేహి దేహి చరణం మూర్ధన్యధన్యస్యమే ॥

అజ్ఞుడను నేను. మందబుద్ధిని. నీ ప్రశంసలు పాడి కృపాపాత్రుణ్ణి కావడానికి నప్రభవామి (సమర్థుణ్ణి కాను). ఆర్తుడనై శరణులేక దీనుడనై ఆక్రందించాను. కర్ణయోః కృత్వా (కొంచెం చెవినిపెట్టి) తొందరగా రా. నిర్భాగ్యుడనైన నా నెత్తిన (కాలుపెట్టు) చరణం దేహి.

అని అంటున్న ఈ కవి చెబుతున్నదేమిటి? జీవితంలో పొందగలిగిందేమీ కనపడటం లేదు. తొందరగా వచ్చి 'వల్లకాటి కేడుకట్ల పల్లకిపై సాగనంపు' అంటున్నాడు కాబోలు. ఒక్కొక్కప్పుడు 'చావుకంటెను బ్రతుకె భయావహమ్ము' అనిపిస్తుంది కాబోలు.

—సౌభరి

పొన్నూరులో ఆంజనేయస్వామి-ఆయన మొహం నిచ్చెనేసుకుని చూస్తేనే గానీ మనక్కనిపించదు. ఈ పిల్లదానికి చూపించాలి. చిత్రాలు చూడ్డం చిన్న పిల్లల సరదా కదా!

ఇందాకణ్ణించీ ఆవిడెవరో చేతులో పిలాడూ, కడుపులో మరో జీవినీ మోసూ నన్నే చూస్తోంది. బస్సు నిండా జనం. కనీసం ఆవిణ్ణి కూచోమని కూడా అనలేదు ఆలోచనల్లో పడి.

శిరీషని లేపి నా ఒళ్ళో కూచో పెట్టు కుని ఆవిణ్ణి కూచోమన్నాను. మొహంలో ఎంతో కృతజ్ఞత. నిండు చూలాలు. పాపం కడుపుతో వున్నమ్మ బాధ కన్నఅమ్మకే తెలుస్తుంది. చేతిలో పిల్లాడికి రెండేళ్ళయినా నిండాయో లేదో! అప్పుడే కడుపు.

"మీ పేరు వాణి కదూ!" తక్కున నా ఆలోచనలకు బ్రేకుపడింది.

"అవును." అన్నాను. ఈ విడెవరా అనుకుంటూ. నా జ్ఞాపక శక్తి అమోఘం. ఒక్కోసారి ఫోంచెయ్యలేదనుకుని రెండో సారి ఫోంచేస్తూ వుంటాను. ఒక్కోసారి చేశాననుకుని పస్తుంటూ వుంటాను.

"నేను ప్రభావతిని. పెద్దింటి రామయ్య గారి అమ్మాయిని మీరూ, నేనూ కలిసి చదువుకున్నాం" అంది.

మెరుపులా తట్టింది నాకు.

"ప్రభా" ఇంచుమించు అరిచినంత పని చేశాను. ఇంత సేపు గుర్తు చేస్తేతప్ప గుర్తుకు తెచ్చుకోలేనందుకు నాకు సిగ్గేసింది. ప్రభావతిదీ, నాదీ మరచిపోయేంత స్నేహం కాదు.

నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తనని, నన్ను మీరు అని మన్నించే స్థితిలో పెట్టినందుకు. తనకి కళ్ళు నీళ్ళతో నిండాయి ఎందుకో మరి.

"ప్రభా! నువ్వా! ఏవిటే ఇలా అయిపోయావు? అసలు గుర్తే పట్టలేదు నేను."

గురు పట్టనందుకు యిదొక కుంటి సాకు అనుకో నక్కరలేదు. నిజంగానే అలావుంది ప్రభావతి. ముద్దబంతిలా వుండేది. పూసిన తంగేడులా వుండాల్సింది ఎండిపోయి, కాంతిహీనంగా, శక్తిలేనట్లు పాలిపోయింది. గాజుగోళీల్లా కళ్ళు అదీ·

ఎంత మార్పు?

15 సంవత్సరాలలో ఇంత మార్పా? ఆశ్చర్యమూ, బాధా కలిగాయి.

"నేనా!" నవ్వింది ప్రభావతి.


"నువ్వు మాత్రం పెద్దగా మారలేదే! అదే నవ్వు, అదే కళ, అదేరూపు. కాకపోతే కొంచెం వయస్సు తెచ్చిన మార్పు అనిపిస్తోంది. అవునూ ఇది నీ కూతురేనా? ఎందరు పిల్లలు?" ప్రభావతి నా ఆత్మీయతని మర్చిపోలేదు.

"అవును. ముగురు పిల్లలా నీకు?"

"ఇదిగో వీడుకాక ముగ్గురు యింట్లో వున్నారు. మరో పది రోజుల్లో మరొకటి వస్తారు." దాని గొంతులో విసుగు.

"ఏవిటే పిచ్చి? ఇంతమంది పిల్లలా? నువ్వుచూస్తే ఇంత వీక్‌గా వున్నావు"

"అదంతేలే. నీ సంగతులు చెప్పు.



నువ్వేం చేస్తున్నావు? మీ వారేం చేస్తున్నారు. పిల్లలు ఏం చేస్తున్నారు?"

"ఉండు తల్లీ చెప్తాను. నేను తిని తిరుగుతున్నాను. మా వారు నెలకు 1000 రూపాయలు సంపాదిస్తున్నారు. ఒక ప్రయివేటు ఫరంలో. పెద్దబాబు బి. ఎస్‌సి. మొదటేడు. తరవాత పిల్ల 10. ఇది మూడోది 7. ప్రస్తుతం మావారి మేనత్త మనవరాలు పెద్దమనిషయితే బంతికి పోన్నూరు పంపించారాయన. అదీ సంగతి. ఇక నువ్వు చెప్పు"

"నాదేముంది. ఇలా వున్నాను. మా వారికి 100 ఎకరాల వ్యవసాయం వుంది. పాలేళ్ళకు వండి పెడుతూ సంపద పెంచుకుంటూ, ఒక్కో ఆడపడుచుకూ కనీసం ఒక్కో పిల్లాణ్నో, పిల్లనో ఇచ్చి వియ్యం అందుకోవాలని. కనక కంటూ వీక్లీలు చదువుకుంటూ, రేడియో వింటూ ఇలా వున్నాను." అంది.

దని మాటలో అంతర్లీనంగా వున్న నిరాశ, విషాదం నాకు చాల బాధ కలిగించాయి

"వీకీలు చదడం మానలేదన్న మాట." దానికి చిన్నప్పట్నించీ సీరియల్స్ పిచ్చి.

"గుర్తున్నాయా? రంగనాయకమ్మగారి క్రిష్ణవేణి. కౌసల్యాదేవిగారి చక్రభ్రమణం?"

"ఎందుగ్గుర్తులేవు? క్లాసులాంగ్ నోటు బుక్స్‌లో పెట్టుకుని ఆ సీరియల్స్‌గా తమరు పఠించేవారు? అది సరేగాని నువ్వైనా, మీ ఆయనైనా ఆప్రేషను చేయించుకోలేక పోయారా?"

"పిచ్చిదానా! మన చేతులో ఏంవుందే? అంతా మన ఖర్మ. ఆ దేవుడు రాసిన రాత."

"నాన్‌సెన్స్. దేవుడూ! రాతా! వాడు యిలా కంటూ కూర్చోమన్నాడా?"

"ఆగు తల్లీ ఆగు దూకుడు కట్టెయ్యి. నువ్వున్న లోకం వేరు. నేనున్న లోకం వేరు. ఇక్కడ నేను సెపినీ బైరులాంటిదాన్ని. నేను నాదిఅనేదిమర్చిపోతేనే బతకగలను."

"నిజంగానా ప్రభా అంత దారుణమా!"

"ఏది దారుణం? హాయిగా కడుపునిండా అన్నం దొరుకుతోంది. ఒంటి నిండా బట్ట దొరుకుతోంది. ఇంట్లోంచి బయటకు వెళ్ళే అవసరం లేకుండా అన్నీ వచ్చిపడుతున్నాయి. తోచక పోతే రేడియోలు. పుస్తకాలూ వున్నాయి. ఇంకేం కావాలేం? అయినా, ఈ సంసార రథం నడిపేది నేనే కదా! ఇంటికి దీపం ఇల్లాలే కదా!"

"అబ్బ ఇక ఆపవె!" అంటూ ఏదో చెప్పబోతున్నాను. ఇంతలో కండక్టరు కేక వినిపించింది- చేబ్రోలు వచ్చిందని.

"సరి ఇక నా స్టాపొచ్చిందిగాని నీ అడ్రసియ్యి. నేరాస్తా. తరవాత నువ్వు రాద్దుగాని." అంది.

నా హాండ్‌బాగ్ లోంచి మా ఆయన విజిటింగ్ కార్డు తీసిచ్చి "నాపేరు రాసి కేరాఫ్ పెట్టెయ్యి" అన్నాను. ప్రభావతి దిగిపోయింది.

నా మనసంతా కలచినట్లయింది. ఎలా వుండేది? ఎప్పుడూ కాల్పనిక ప్రపంచంలో విహరించేది. జీవితాన్ని సుందరంగా వూహించుకునేది. సంతోషంగా వుండేది. తనచుట్టూ వాళ్ళని కూడా ఆనందంగా వుంచేది.

15 సంవత్సరాల్లో యెంతనిరాశ, యెంత దైన్యం?....

ఇది జరిగి రెండేళ్ళయింది. రెండేళ్ళ నాటి ప్రభావతి కలయిక ఎందుకో పదే పదే గుర్తొస్తోందివాళ.

ఆనాటికీనాడు మళ్ళీ అదే రూట్లో ప్రయాణం చేస్తున్నాను. అందుకే అయి వుంటుంది.


మీ కేశ సౌందర్యాభివృద్ధికి కొబ్బరినూనె కంటె అతి ఉత్తమమైనదేది?

**కేశవర్ధినిని**

చేర్చిన కొబ్బరినూనె

OBM 6119/TG




ఔను! మీరు ప్రతి నిత్యమూ తలకు రాసుకుంటూన్న కొబ్బరినూనెలో కొన్ని చుక్కలు కేశవర్ధినిని కలపండి. తల చర్మానికి అంటేటట్టుగా తలకు రాసుకోండి. ఇదే అందంగా తల వెంట్రుకలు పెరగడానికి సాంప్రదాయిక రహస్యము- కేశవర్ధిని. వెంటనే ఒక బాటిల్ కేశవర్ధినిని కొని వాడండి.




కేశవర్ధిని ప్రోడక్ట్స్
మద్రాసు-600 087



నేనెప్పుడూ చెప్పిన టైమ్‌కంటే ఒక పావు గంట ముందుగానే నడుస్తాను. అదే నన్ను మనిషిగా తీర్చిదిద్దింది.

—లార్డ్ నెల్సన్

* * *

చెప్పిన వేళకు రాని వ్యక్తి కాలం విలువ తెలియనివాడు. పెద్ద నీతిమంతుడూ, మేధావంతుడూ అని చెప్పినా నమ్మకండి.

—ఎమ్మన్స్

* * *

ఎక్కడినుంచో కవిత్వం పుట్టుకురాదు. అది నీలోనే అంతో, ఇంతో వుండాలి.

—జాబర్

* * *

కవిత్వం మాటల సంగీతం. సంగీతం అంటే ధ్వనులతో కవిత్వం అల్లడం.

—ఫుల్లర్

* * *

కొత్తగా అందిన సుఖాలు కొత్త బాధలను కలిగిస్తాయి.

—బల్వర్

* * *

ప్రపంచాన్ని సంస్కరించదలిస్తే, చెడును తొలగించదలిస్తే, ఆ పని తల్లుల దగ్గర ప్రారంభం కావాలి.

—సిమ్మన్స్

* * *

కవిత్వం అంటే నీడల్ని "ప్రోది"చేయడం లేనిదాన్ని వున్నట్టు భ్రమ కల్పించడం.

—బర్క్

యౌవనంలో అతిగా అనుభవించినవారు ముప్ఫయి ఏళ్ళ తరువాత వృద్ధాప్యంలో వడ్డీతోసహా వాటి దుష్ఫలితాలను అనుభవిస్తారు.

—కోల్టన్

సేకరణ :

—జ్యోత్స్న, రాయగడ

ఇంతకీ ప్రభావతి ఏమయిందో, ఏమిటో అంతులేదు. ఇదిగో ఉత్తరం రాస్తానంది. ఉత్తరమూ లేదు. మనిషీ లేదు.

ఆలోచనల్లో పడి చేప్రోలు వచ్చిన సంగతి గమనించుకోలేదు. ఒక్క కుదుపుతో బస్సు ఆగింది. ఆ కుదుపుకి ఆలోచనల్లోంచి తేరుకున్నాను.

రాజారావు బస్సు ఎక్కుతున్నాడు.

బి.ఎ. లో క్లాసుమేటు. ఎంత బావుండేవాడో ఇప్పటికీ అదేలా వున్నాడు.

నవ్వొకుంది తనలో తను. పధేళ్ళు కలిసి మెలిసి తిరిగిన ప్రభావతిని చూసీ చూడగానే గుర్తించలేకపోయిన తను, రాజారావుని మాత్రం వెంటనే గుర్తించింది. అంతే మరి. ఏదిగాక మనసు మీద పడ్డ ప్రతి గుర్తూ శాశ్వతంగా వుంటుందేమో మరి.

ఆ రోజుల్లో రాజారావుకి తనంటే విపరీతమయిన క్రేజ్. ఓ సారి లవ్ లెటర్ కూడా రాశాడు. అంతరాంతరాల్లో తనకీ ఉండేది అతన్ని చేసుకోవాలని. సందర్భ పడలేదు. ఇప్పుడూ ఎప్పుడన్నా కోపమొస్తే అనిపిస్తుంది అతన్ని చేసుకుని ఉంటే బావుండేదని

అతనూ గుర్తు పటినట్లున్నాడు సన్నగా నవ్వుతున్నాయతని పెదవులు.

ఇంకా ఆకర్షణీయంగానే ఉన్నాడంటే చెప్పుకోదగ్గ విషయమే.

పక్క సీట్లోంచి గుసగుసలు వినిపిస్తున్నాయి.

"అడుగో ఆదే కోటయ్యగారి రాజారావు"

"ఈడేనా! బెమ్మాండంగా వుండాడు."

"ఆడికేం! మగ మారాజు. బెమ్మాండంగానే వుంటాడు."

"అక్కాయ్! నిజమేనంటే ఈడిములానే పెళ్ళాం సచ్చిందంటారు?"

"కాక! మేం ఆళ్ళింటికాడేగా వుండేవోళ్ళం. మా తలి. ఆవిణ్ణి రాసి రంపానెట్టాడు అనుమానప్పచ్చి పాపాళ్ళకి ఒండిపెట్టేది తల్లిలాగ పన్నెత్తి మాటాడ ఎరగదు. పెళ్ళయినంక పదేనేళ్ళో పదారేళ్ళో బతికింది"

"కొట్టేవాడా?"

"కొట్టటంలో అట్టా, ఇట్టా కాదు సెర్నాకోలతీసుకుని గొడ్డుని బాదినట్టు బాదేవాడు. పుట్టింటాళ్ళకి చెలుత్తదేమోనని పిసుక్కు సచ్చిపోయేది. సివరికి నిజంగానే సచ్చిపోయింది."

"కానుపులో పోయిందంటగా?"

"కానుపులోనే బలహీనత ఎక్కువై సచ్చిపోయిందన్నాడంట డాకటరు."

# రస గుళిక

## మొట్టమొదటి మెనూ కార్డ్

**1489** వ సంవత్సరంలో జర్మనీలో 'రాటెస్ బస్ డ్యూక్' అనే ధనవంతుడు ఒక పెద్ద విందు ఏర్పాటు చేశాడు. తన ఆహ్వానం అందుకున్న అతిథులంతా మంచి ఆకలి మీద విందుకు హాజరవ్వాలని రాటెస్ కోరిక. అందువల్ల తాను ఇవ్వబోయే విందులో ఏఏ పదార్థాలు వంటవాళ్ళు తయారుచేసి వుంచారో ఒక లిస్టు వ్రాయమని హుకుం జారీచేశాడు. దాన్ని చూసుకొని అతిథులు తమ పొట్ట విస్తీర్ణాన్ని సరిచేసుకోవాలని ఆయన ఉద్దేశ్యం. అదే మొట్టమొదటి మెనూ కార్డ్. పెద్ద పెద్ద డిన్నర్లలోను హోటళ్ళలోను యిప్పుడు కనిపించటం పరిపాటి అయింది.

సేకరణ : పి.వి.యస్. ప్రసాద్

"పాపం"

నా మెదడు మొద్దుబారిపోయింది. ఈ సుందరరూపి రాజారావులో ఇంత భయంకరమైన రాక్షసుడున్నాడా? అయినా సందేహం నివృత్తి చేసుకుందామనిపించింది. ఈ హడావుడిలో పొన్నూరు వచ్చేసింది

బహుశా నేను పలకరిస్తాననే నించున్నట్లున్నాడు. నన్ను చూసి నవ్వాడు. నేనూ నవ్వాను

పరామర్శలయ్యాక అడిగాను ఉండబట్టలేక. అతని తండ్రి పేరు కోటయ్యేట.

భార్య సంగతి అడిగాను.

మొహం విషాదం పూసుకుంది.

"నా భార్య పోయి రెండేళ్ళయింది కృష్ణా."

"ఎలా పోయింది?" ఇంకా అతను కాదేమో - అని - కాకుండా వుంటే బాగుండుననీ.

"కాన్పులో."

"అసలెవరమ్మాయిని చేసుకున్నావు?"

"పెద్దింటి రామయ్య గారమ్మాయి ప్రభావతిని."

నాకు కళ్ళు తిరుగుతున్నాయి. ■